క్లుప్తంగా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు


లామా పద్మారావు (ఫైల్)

నాగులుప్పలపాడు: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం కుదరదని గత ప్రభుత్వాలు విస్మరించినప్పటికీ ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసాధ్యాన్ని సుసాధ్యం చేసి రాష్ట్రంలోని 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడానికి ఆర్థికశాఖ ద్వారా విధి విధానాలు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందని కాంట్రాక్టు లెక్చరర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆంధ్రప్రదేశ్ కో–చైర్మన్ లామా పద్మారావు తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5 వేల మంది కాంట్రాక్టు లెక్చరర్ల కుటుంబాలు జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటాయని అన్నారు.

సైడు కాలువ నిర్మాణానికి శంకుస్థాపన


సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

చీమకుర్తి: మండల పరిషత్ నిధులు రూ.47 లక్షలతో బూదవాడ సచివాలయం పరిధిలోని మర్రిచెట్లపాలెంలో సైడు కాలువల నిర్మాణానికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం శంకుస్థాపన చేశారు. రాకపోకల సమయంలో రోడ్డు మీదకు మురుగు నీరు రాకుండా స్థానికుల విజ్ఞప్తి మేరకు సైడు కాలువను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచ్ జంగ్రాజుపల్లి మరియమ్మ సామ్యేల్, ధర్మవరపు సంజీవరెడ్డి, జె.యాకోబు, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ఒంగోలు రూరల్: రూరల్‌లోని త్రోవగుంట, కరవది ఉన్నత పాఠశాలలను ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ మెంబర్ జి.దేవి ఆకస్మికంగా సందర్శించారు. కరవదిలో మధ్యాహ్న భోజన సమయానికి చేరుకున్న ఆమె నేరుగా వంటశాల వద్దకు వెళ్లి భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఉన్న ఆర్జేడీ సుబ్బారావు, ఒంగోలు ఎంఈవో కిశోర్ బాబులకు వంట నిర్వాహణలో పలు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంగా గురించి వారి అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. జగనన్న గోరు ముద్ద మెను ప్రకారం అందుతుందా లేదో తెలుసుకునేందుకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాల్సిందిగా హెచ్‌ఎం రవికుమార్‌ను ఆదేశించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

మడనూరు (కొత్తపట్నం): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.సుజాత అన్నారు. గురువారం మడనూరు సచివాలయం–2లో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 22.05 కోట్లుతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అనంతరం వివిధ పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్ధిదారుల జాబితా డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ, నోడల్ ఆఫీసర్ ఏ.బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రావు, ఎం.ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వీవోఏలు, గృహ సారథులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు చాలా ముఖ్యం

ఒంగోలు: ప్రస్తుత ప్రపంచంలో ఇంధన రేట్లు అధికంగా ఉన్న సందర్భంగా ఇంధన పొదుపు చాలా ముఖ్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ పాలగిరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి ఆధ్వర్యంలో శక్తి పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు అలవాటు చేసుకోవడం, సమష్టిగా పర్యావరణ పరిరక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. స్థిరమైన స్థితిస్థాపకత, భవిష్యత్ కోసం పనిచేయడాన్ని నెమరు వేసుకోవడం అన్నారు. అవగాహన కార్యక్రమంలో శక్తి పరిరక్షణ చిట్కాలు, పర్యావరణంపై ఇంధన వినియోగం, ప్రభావం, ఇంధనాన్ని సమర్థవంతమైన సాంకేతికతలను అవలంబించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగానికి సంబంధించిన అధ్యాపకులు ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

● శానిటేషన్ సెక్రటరీల సమీక్షలో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు


గణపతి నగర్‌లో నిర్మాణంలో ఉన్న రోడ్డు పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగరంలోని పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన కౌన్సిల్ హాలులో గురువారం సాయంత్రం శానిటేషన్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా జగనన్న స్వచ్ఛతా సంకల్ప కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని వివరించారు. యూజర్ చార్జీలు వసూలులో వేగం పెంచాలన్నారు. నగరంలో చెత్త సేకరణలో భాగంగా మూడు బుట్టల కార్యక్రమాన్ని విరివిగా చేపట్టాలన్నారు. తడి, పొడి, హానికార చెత్తలను వేరు చేసే కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దానివల్ల గార్బేజ్ స్టేషన్‌లో పని సులభతరమవుతుందని వెల్లడించారు. యూజర్ చార్జీల వసూళ్లలో వెనకబడిన సెక్రటరీలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అన్ని రకాల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ, ఇతర అధికారులు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు రోడ్డు నిర్మాణ పనులు

ఒంగోలు సబర్బన్: రోడ్ల నిర్మాణ పనులు నిబంధనల మేరకు చేపట్టాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నగరంలో నిర్మాణంలో ఉన్న బీటీ, సీసీ రోడ్డు పనులను కమిషనర్ గురువారం పరిశీలించారు. అందులో భాగంగా 43వ డివిజన్‌లోని గణపతి నగర్‌లో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. రూ.30 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డును నాణ్యతగా చేపట్టాలన్నారు. సిమెంట్, ఇసుక సమపాళ్లలో వేయాలన్నారు. కాంక్రీట్ ఫ్లోరింగ్ నిబంధనల మేరకు మిక్సింగ్ చేయాలని సూచించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేపట్టాలన్నారు. అనంతరం విరాట్ నగర్ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ముందుగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి ప్రజలకు చేయాల్సిన సేవలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సేవలు అందించటంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. డీఈ గణపతి, ఇతర అధికారులు ఉన్నారు.


శానిటరీ సెక్రటరీలతో సమీక్షిస్తున్న కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు


హాజరైన శానిటరీ సెక్రటరీలు

డాక్టర్ టాన్య సేవలు మరువలేనివి


డాక్టర్ టాన్యా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: మహిళా ఉద్యమంలో నేతగా జిల్లాలో ఐద్వా నిర్మాణంలో కీలకపాత్ర వహించిన డాక్టర్ టాన్య నిబద్ధతతో ప్రజలకు వైద్య సేవలను అందించారని బేతూన్ నర్సింగ్ హోం వైద్యురాలు డాక్టర్ ఉదయిని అన్నారు. ప్రజా వైద్యురాలు టాన్య 82వ జయంతి సందర్భంగా గురువారం బేతూన్ నర్సింగ్ హోంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గత 12 ఏళ్లుగా నర్సింగ్ హోంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల మహిళల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనేక వైద్య పరీక్షలను నిర్వహించడమే కాకుండా వైద్య సలహాలు, మందులను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి టాన్య జీవితం నేటి తరం మహిళలకు ఆదర్శనీయమని చెప్పారు. జిల్లాలో డాక్టర్ రంగారావు, టాన్య దంపతులు ప్రజలకు వైద్య సేవలను అందించడమే కాకుండా సామాజిక చైతన్యం కలిగించేందుకు కృషి చేశారన్నారు. క్యాన్సర్ బారిన పడిన మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంఎన్ఆర్ క్యాన్సర్ వైద్యశాల డాక్టర్ రమణారెడ్డి వివరించారు. అనంతరం డాక్టర్ పురుషోత్తం టాన్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యులు స్వాతి, కృష్ణకుమారి, కళ్యాణి వైద్య సేవలందించారు. ఐద్వా నాయకులు మాలతి, సీతామహాలక్ష్మి, ఎస్కే నాగూర్, రాజేశ్వరి, పద్మ, రమణమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గోవిందనామ స్మరణతో కలశాల ఊరేగింపు


చీమకుర్తి మెయిన్‌రోడ్డులో కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, చిన్నారులు


హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

చీమకుర్తి: గోవింద మాల ధరించిన భక్తుల ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులు గోవిందనామ స్మరణతో కలశాలను అత్యంత భక్తిశ్రద్ధ ఊరేగించారు. చీమకుర్తిలోని ఇసుకవాగు సెంటర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా హరిహర క్షేత్రం వరకు గురువారం మహిళలు, చిన్నారులు కలశాలను పవిత్ర గంగాజలాలను తీసుకొని ఊరేగింపుగా హరిహరక్షేత్రం వరకు వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. గోవింద మాలలను ధరించిన భక్తులు, మహిళలు, చిన్నారులు దాదాపు 600 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. హరిహరక్షేత్రంలో గోవింద మాలలతో వచ్చిన భక్తులతో గోవిందనామస్మరణ మార్మోగింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా పాండురంగారావు, శిద్దా హనుమంతురావు, సుధాకర్, వారి కుటుంబసభ్యులతో పాటు స్థానిక భక్తులతో కలిసి ఆలయ అర్చకులు నిర్వహించిన హోమాల్లో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత శ్రీకృష్ణమందిరం వద్ద అద్దంకి వైఎస్సార్‌సీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి చేతుల మీదుగా భక్తులకు కలశాలను అందించి పూజలు నిర్వహించారు.

అయ్యప్పస్వామికి బూచేపల్లి పూజలు


అయ్యప్పస్వామి మాలను స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చీమకుర్తి: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తన కుమారుడు, కుమార్తెతో కలిసి గురువారం చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్పమాలలను స్వీకరించారు. అనంతరం స్వామికి వెంకాయమ్మతో కలిసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సీఎంబీసీ డిగ్రీ కాలేజీ భవనం అటాచ్‌మెంట్



సీఎంబీసీ కాలేజీ భవనానికి అంటించిన ఫ్లెక్సీ

ఒంగోలు: పీఎఫ్ బకాయిలు చెల్లించకపోవడం, పలుమార్లు సంస్థ యజమానులకు తెలియజేసినప్పటికీ బకాయిలు చెల్లించకపోవడంతో ఒంగోలులోని సీఎంబీసీ సంస్థ భవనాన్ని అటాచ్ చేసినట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ జిల్లా కార్యాలయం రికవరీ ఆఫీసర్ సతీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. సంస్థ రూ.5.5 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ సంస్థ భవనాన్ని ఈనెల 13న అటాచ్‌మెంట్ చేశామన్నారు. బకాయిలను చెల్లించకపోవడంతో భవన స్థలాన్ని అమ్మి వసూలు చేస్తామన్నారు. జిల్లాలో ఉన్న వివిధ సంస్థల యజమానులు తాము చెల్లించాల్సిన బకాయిలను పది రోజుల్లోగా చెల్లించాలని, లేని పక్షంలో సంస్థల ఆస్తులను జప్తు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

గ్రామాల్లో పర్యటించిన డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి


కరవది పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి

ఒంగోలు రూరల్: గ్రామాల్లో అందుతున్న వైద్య సేవల గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు ఆరా తీశారు. గురువారం డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి ఒంగోలు మండలంలోని కరవది, ఉలిచి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఉలిచిలోని ఎస్టీ కాలనీ, సబ్‌సెంటర్లలో టీం అధికారిణి లూథ్యారాణి ఇమ్యూనైజేషన్ చేసే క్రమాన్ని, ఇంజక్షన్ శాంపిల్స్‌ను పరిశీలించారు. నెలవారి చిన్నారులకు వేస్తున్న టీకా కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఉలిచి సబ్‌స్టేషన్ చేరుకొని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమం అనంతరం కరవది ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ వాణి, హెచ్‌ఈవో కృష్ణారెడ్డితో మాట్లాడారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం పకడ్బందీగా జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జయకుమారి, రజనీ, స్టాఫ్ నర్సులు జ్యోతి, భానుమతి, హెల్త్ సూపర్‌వైజర్ మాధురి ఉన్నారు.

అయ్యప్ప భక్తుల అన్నదాతకు సత్కారం


అంజయ్య, మారుతీదేవిని సత్కరిస్తున్న దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ

చీమకుర్తి: అయ్యప్పస్వామి భక్తులతో పాటు సర్వ మాలలను ధరించిన భక్తులకు నెలరోజుల పాటు అన్నదానం చేసిన గురుస్వామి, ఎండ్లూరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుంచాల అంజయ్య, ఉప సర్పంచ్ కేవీ మారుతీదేవిని సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ చేతుల మీదుగా సత్కరించారు. గురువారం సంతనూతలపాడు మండలం ఎండ్లూరులోని అంకమ్మ తల్లి ఆలయం వద్ద వారిని శాలువాతో సత్కరించారు. నెలరోజుల పాటు అన్నదానం చేసిన అనంతరం బుధవారం రాత్రి నిర్వహించిన అయ్యప్పస్వామి పడిభజన కార్యక్రమంలో చెంచిరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

పొగాకు సాగులో మెళకువలు పాటించాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వేలం నిర్వాహణాధికారి రామకృష్ణ

ఒంగోలు సెంట్రల్: నాణ్యమైన పొగాకు ఉత్పత్తిలో రైతులు మెళకువలు పాటించాలని ఒంగోలు–2 వేలం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ అన్నారు. టి.అగ్రహారం గ్రామంలో గురువారం రైతులకు పురుగుమందుల అవశేషాలు, పొగాకేతర అన్య పదార్థాల వల్ల కలిగే ప్రతికూల పరిస్థితులు, యాజమాన్యంపై రైతులకు శిక్షణ నిర్వహించారు. వేలం నిర్వాహణాధికారి కోవి రామక్రిష్ణ మాట్లాడుతూ పురుగుమందుల అవశేషాలు, పొగాకేతర అన్యపదార్థాల వల్ల మార్కెట్‌లో ప్రతికూల పరిస్థితులు ఉంటాయని చెప్పారు. పొగాకు మొక్క తలలు తుంచుట, పిలకలను నివారించడం వల్ల కలిగే ఉపయోగాలపై, పెను బంక, పచ్చపురుగు, రసం పీల్చే పురుగుల నివారణకు తగు సూచనలు చేశారు. ఐటీసీ మేనేజర్ యశ్వంత్‌కుమార్, పీఎస్ఎస్‌హెచ్ రామాంజనేయులు, రైతు సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష రక్షణ మనందరి బాధ్యత

● మేయర్ గంగాడ సుజాత


తెలుగు సభల బ్రోచర్ విడుదల చేస్తున్న మేయర్ సుజాత

ఒంగోలు టౌన్: మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో జనవరి 5,6,7 తేదీల్లో నిర్వహించనున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల బ్రోచర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ విద్యార్థులు మాతృభాషతో పాటుగా అన్నీ భాషలను నేర్చుకోవాలని సూచించారు. తెలుగు సాహిత్యంపై అభిరుచి పెంచుకోవాలన్నారు. ఈమహాసభల్లో తెలుగు భాషలోని 25 సాహితీ ప్రక్రియలపై మూడు రోజులపాటు సదస్సులు జరుగుతాయని పరిషత్ సభ్యురాలు కృష్ణవేణి పరాంకుశం తెలిపారు. కవిత్వం, కథలతో సహ పౌరాణిక, సాంఘిక నాటకాలు, చలన చిత్ర జానపద సంగీతం, బుర్రకథ, అవధానం, కూచిపూడి నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు. తెలుగు భాష వైభవాన్ని చాటిచెప్పే ఈ సభలకు భాషాభిమానులు, సాహితీ ప్రియులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొడ్డవరంలో దోమల నివారణకు చర్యలు


ఎబేట్ పిచికారీ చేయిస్తున్న వైద్యశాఖ సిబ్బంది, గ్రామ కార్యదర్శి

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామంలో దోమల నివారణకు వైద్యారోగ్యశాఖ సూపర్‌వైజర్ బాలకోటయ్య గురువారం ప్రత్యేక చర్యలు చేపట్టారు. చలికాలం దోమల ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దోమల లార్వాల నివారణకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ సుబ్బారావు, గ్రామ కార్యదర్శి అజయ్‌కీర్తి మురుగు కాలువల్లో పూడికలు తీయించగా, సూపర్‌వైజర్ ఎబేట్ మందు పిచికారీ చేయించారు. గ్రామంలో మురుగునీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. దోమలు పెరగకుండా లార్వాలను కూడా నిర్మూలించారు. తెల్లబాడు గ్రామంలో కూడా పూర్తి స్థాయిలో ఎబేట్ చల్లించిన తర్వాత రెండు గ్రామాల్లో ఫాగింగ్ చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనూష, ఎంఎల్‌హెచ్‌పీ ధరణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏకేయూ మొదటి సెమిస్టర్ పరీక్షలు


ఏకేయూ మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. గురువారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు పలు సెంటర్లను పర్యవేక్షించారు. రిజిస్ట్రార్ హరిబాబు స్వయంగా ఒంగోలుతో పాటు అద్దంకి, మార్టూరులలో ఉన్న పలు సెంటర్లను తనిఖీచేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల నిర్వాహకులకు పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 38 పరీక్ష కేంద్రాల్లో జరిగే విధంగా యూనివర్శిటీ అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. కేంద్రాల ద్వారా యూనివర్శిటీలోని 88 కాలేజీల నుంచి మొత్తం 8120 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నారు. 38 పరీక్ష కేంద్రాలకు 49 మంది ప్రత్యేక పరిశీలకులను అధికారులు నియమించారు. వీరితో పాటు 9మంది సభ్యులతో కూడిన మూడు తనిఖీ బృందాలు నియమించారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఏర్పడిన తరువాత మొదటిసారి పరీక్షలు నిర్వహిస్తుండడంతో అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు, ప్రశ్నపత్రాల తయారీ, పరీక్ష కేంద్రాల ఏర్పాటు, పరిశీలకులు, తనిఖీ బృందాల నియామకం తదితర విషయాలలో పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు. నగరంలో పరీక్ష కేంద్రాలను తనిఖీచేసిన వారిలో పరీక్షల సమన్వయకర్త డాక్టర్ డీ వెంకటేశ్వరరెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ బి.పద్మజ, డీఓఏ డాక్టర్ జి.సోమశేఖర, ఓఎస్‌డీ డాక్టర్ కేవీఎస్ రాజు తదితరులు ఉన్నారు. తొలిరోజు పరీక్షలను విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులను వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అభినందించారు.

అయ్యప్పస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో వార్షిక పవిత్రోత్సవాల సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 18 సోమవారం వరకు స్వామికి విశేష పూజలు హోమాలు, ఆభరణ సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశ కేశవాచార్యులు తెలిపారు. గురువారం సాయంత్రం ఆరు గంటలకు మంగళ ధ్వని, స్వస్తివాచనం, ఆచార్య ప్రణామం, రాత్రి ఏడు గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, ఆచార్యుని ఋత్విగ్వరణం, మేదిని పూజ, అంకురారోహణ కార్యక్రమాన్ని కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు రంగాస్వామి, చక్రవర్తి సమీర్ కుమార్ వైభవంగా నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామికి అర్చన, నివేదన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న స్వామి మాలధారులు